సాక్షి
నిర్మల్

శుక్రవారం ◊ 24 ◊ మే ◊ 2024

కమనీయం.. లక్ష్మీనరసింహుని కల్యాణం



దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామ పరిసర అటవీప్రాంతంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీ నరసింహుడి కల్యాణాన్ని గురువారం వైభవోపేతంగా నిర్వహించారు.

8లో ▸

గరిష్టం/కనిష్టం
42.8 /30.5

వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం నుంచే వేడిగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- హాజరుకానున్న 5,417 మంది విద్యార్థులు



నిర్మల్ రూరల్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికోసం జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీఐఈవో పరశురామ్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 3,416 మంది విద్యార్థులు, సెకండియర్‌లో 2,001 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. వార్షిక పరీక్షల మాదిరిగానే ఈసారి కూడా విద్యార్థులకు ఐదు నిమిషాల నిబంధన అమలులో ఉంటుందని తెలిపారు.

నేడు పాలిసెట్

నిర్మల్ రూరల్: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష పాలిసెట్ శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులందరూ గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. మొత్తం 1,946 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నారు.

బుద్ధుని మార్గం అనుసరణీయం



బుద్ధునికి పూజలు చేస్తున్న రామారావుపటేల్

భైంసాటౌన్: బుద్ధుని మార్గం ప్రతి ఒక్కరూ అనుసరించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ అన్నారు. పట్టణంలోని రాహుల్‌నగర్ మైత్రేయ బుద్ధవిహార్‌లో గురువారం నిర్వహించిన బుద్ధ జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బుద్ధుని బోధనలు ప్రపంచశాంతికి బాటలు వేశాయన్నారు. అంతకుముందు గౌతమ బుద్ధుని విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నారాయణ్‌రెడ్డి, గాలి రాజన్న తదితరులు పాల్గొన్నారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుద్ధవిహార్‌లో వైశాఖ బుద్ధ పూర్ణిమ ఘనంగా నిర్వహించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

ఖానాపూర్: ఐదు నెలలుగా ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజనులపై జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలన్నారు. ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్‌లో 120 మంది గిరిజనుల హత్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు దుర్గం లింగన్న, గొనె స్వామి, గూట్ల ప్రసాద్, రేగుల గంగన్న, గోగు శేఖర్, మల్లక్క పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి



మాట్లాడుతున్న వెంకట్రావు

ఖానాపూర్: ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావు కోరారు. పట్టణంలో గురువారం నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. పాఠశాలల ప్రారంభానికి ముందే బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని, పాఠశాలలను ఉన్నతీకరించాలని కోరారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలతోపాటు ఉచితంగా నోటు పుస్తకాలు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ పాల్గొన్నారు.

కొందరికే బోనస్!



కుంటాల : కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం ఆరబెడుతున్న రైతులు

- జిల్లాలో 80 శాతం దొడ్డు వడ్లే సాగు..
- ప్రభుత్వ ప్రకటనతో జిల్లా రైతుల్లో అయోమయం
- ఏం వడ్లు సాగు చేయాలో తేల్చుకోలేని పరిస్థితి

భైంసా: సన్నరకం వడ్లకు ఈ ఖరీఫ్ నుంచి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు మూడు రోజుల క్రితం నిర్వహించిన కేబినెట్ సమావేశంలో తీర్మానం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లా రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఎన్నికల్లో వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు సన్నరకాలకే ఇస్తామని ప్రకటించడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో ఏటా వరి సాగుచేస్తారు. ఇందులో లక్ష ఎకరాలు దొడ్డు రకం వడ్లే సాగుచేస్తారు. ప్రభుత్వ నిర్ణయంతో కేవలం 20 శాతం మంది రైతులకే లబ్ధి కలుగనుంది.

నారుపోసే ముందే ప్రకటన..

జిల్లాలో వరి ధాన్యం సాగుచేసే రైతులంతా నారు పోసేందుకు సిద్ధమవుతున్నారు. రోహిణి కార్తె ప్రవేశించగానే నార్లు పోసుకునేందుకు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే సన్నాలకు బోనస్ ప్రకటన వచ్చింది. దీంతో రైతులు అయోమయంలో పడ్డారు. ఇప్పుడు రైతులంతా సన్నాలు సాగుచేయలా.. దొడ్డు వడ్లే పండించాలా అన్న అయోమయంలో ఉన్నారు. మరోవైపు జిల్లాలో ఏటా దొడ్డు వడ్ల విత్తనాలకే డిమాండ్ ఉండడంతో విత్తన దుకాణాల యజమానులు దొడ్డు రకం విత్తనాలే తీసుకొచ్చారు. ప్రభుత్వ ప్రనకటనతో ఇప్పుడు కొందరు రైతుల సన్నాలకు మొగ్గు చూపుతారని భావిస్తున్నారు.

దిగుబడి తక్కువే...

ఎకరం పొలంలో దొడ్డు రకం వరి ధాన్యం 25 నుంచి 32 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. అదే సన్నరకం 15 నుంచి 20 క్వింటాళ్లకు దాటదు. దొడ్డు రకం వరి తెగుళ్లను తట్టుకుంటుంది. సన్నరకాలకు తెగుళ్ల బెడద ఎక్కువ. సన్నరకం వడ్లుసాగుచేస్తే 60 శాతం దోమపోటు వచ్చే అవకాశం ఉంటుంది. సన్నరకం వడ్లకు సస్యరక్షణ చర్యలు చేపట్టలేక రైతులు ఇబ్బందులుపడతారు. రైతులకు దొడ్డురకం సాగుచేస్తేనే కొంతమేర లాభాలు వస్తాయి. జిల్లా నేలలు దొడ్డురకం సాగుకే అనువుగా ఉంటాయని రైతులు చెబుతున్నారు. దొడ్డురకం వడ్లు 100 రోజుల్లోనే పంట చేతికి వస్తుందని, సన్నరకాల పంట ఐదు నుంచి ఆరు నెలల సమయం పడుతుందని పేర్కొంటున్నారు.

మార్కెట్‌లో డిమాండ్...

గత వర్షాకాలంలో పండించిన సన్నరకాల వడ్లు క్వింటాలు రూ.3 వేల నుంచి రూ.3,200 వరకు పలికింది. మార్కెట్‌లో సన్నరకం వడ్లకు మంచి డిమాండ్ ఉంది. ఇళ్లలో మధ్య తరగతివారంతా సన్న బియ్యమే తింటున్నారు. దీంతో గత వర్షాకాలంలో సన్నరకం వడ్లకు మంచి ధర పలికింది. ప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాలు రూ.2,203 ధర చెల్లిస్తుంది. సన్నరకం సాగుచేసిన రైతులకు ప్రభుత్వం ఇదే ధర ఇస్తుందని రైతులు చర్చిస్తున్నారు. సన్నరకాలకు మార్కెట్‌లో కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే రైతులే నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో కలిపి ధర రూ.2,700 దాటదని, ఇలాంటి సమయంలో ప్రైవేటువారికి అమ్మితే క్వింటాల్‌కు రూ.3 వేలకుపైగా వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని కోరుతున్నారు.

దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలి..



దొడ్డురకం వడ్లకు కూడా ప్రభుత్వం బోనస్ ప్రకటించాలి. ఎన్నికల సమయంలో వరిధాన్యం మొత్తానికి బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు సన్న వడ్లకే ఇస్తామనడం సరికాదు. ప్రభుత్వం అందరికీ బోనస్ ఇవ్వాలి.
– శ్రీనివాస్, రైతు

సన్నరకంతో కష్టమే



సన్నరకం వడ్ల సాగుతో రైతులకు ఇబ్బందులు వెంటాడుతాయి. సన్నరకాలకు దోమపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దోమపోటుతో దిగుబడి భారీగా తగ్గుతుంది. సన్న వడ్లను ప్రభుత్వానికి అమ్మినా పెద్దగా లాభం ఉండదు. ప్రైవేటుగా విక్రయిస్తేనే రైతులకు లాభం. – గంగాధర్, రైతు

ధర పెంచాలి



సన్నరకం వడ్లు క్వింటాలుకు రూ.3,200 వరకు ధర పలికింది. ప్రభుత్వం రూ.2,203 ధర చెల్లిస్తుంది. సన్నరకం వడ్లకు ప్రభుత్వం ధర పెంచాలి. ధర పెంచి బోనస్ ఇస్తే రైతులకు గిట్టుబాటు అవుతుంది. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి. – సాయినాథ్, రైతు

సింగిల్ జడ్జి జైలు శిక్ష ఆదేశాలపై స్టే

- కోర్టు ధిక్కరణ కేసులో నిర్మల్ పూర్వ కలెక్టర్‌కు ఊరట

సాక్షి, హైదరాబాద్: నిర్మల్ పూర్వ కలెక్టర్ (ప్రస్తుత ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ ఎండీ) మహమ్మద్ ముషారఫ్ అలీ ఫారుఖీకి హైకోర్టులో ఊరట లభించింది. కోర్టు ధిక్కరణ కేసులో సింగిల్ జడ్జి వేసిన ఒక నెల సాధారణ జైలు శిక్ష ఉత్తర్వులను ద్విసభ్య ధర్మాసనం నిలుపుదల చేసింది. ఈ మేరకు జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 44 మంది ఆరోగ్య కార్యకర్తలకు 2022లో పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే ఆర్థిక శాఖ అనుమతి రాలేదంటూ అధికారులు వారికి వేతనాలు ఇవ్వలేదు. ట్రెజరీలో వేతనాలున్నా ఇవ్వడం లేదంటూ తొలుత వీరంతా హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం వారికి జీతాలివ్వాలని కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయినా చెల్లించకపోవడంతో మరోసారి వారు కోర్టును ఆశ్రయించి ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను 15 రోజుల్లోగా అమలు చేయాలని ఆదేశించారు. ‘ఒకవేళ అమలు చేయని పక్షంలో కలెక్టర్ నెల రోజులు, కమిషనర్ 15 రోజుల పాటు సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుంది. రూ.2,000, రూ.1,000 చొప్పున జరిమానా కూడా కట్టాలి. ఒకవేళ జరిమానా చెల్లించకుంటే మరో పది రోజులు, వారం చొప్పున కలెక్టర్, కమిషనర్ సాధారణ జైలు శిక్ష అనుభవించాలి. తప్పుడు సమాచారం ఇచ్చినందుకు కూడా వారు శిక్షకు అర్హులు. దీనిపై వారికి నోటీసులు జారీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశిస్తున్నాం. ఈ తీర్పుపై అప్పీల్‌కు వెళ్లేందుకు కోర్టు సెలవుల కారణంగా 2 నెలల సమయం ఇస్తున్నాం. అప్పటి వరకు తీర్పు అమలును సస్పెన్షన్‌లో ఉంచుతున్నాం’ అని పేర్కొన్నారు. కాగా, సింగిల్ జడ్జి ఆదేశాలను సవాల్ చేస్తూ మహమ్మద్ ముషారఫ్ అలీ అప్పీల్ దాఖలు చేశారు. విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఆదేశాలపై స్టే విధిస్తూ, విచారణను వాయిదా వేసింది.

ఈ నెలాఖరు వరకు కొనుగోళ్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మామడ: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. పొన్కల్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు లారీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. గోనె సంచుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

‘అమ్మ ఆదర్శ’ పనులు పరిశీలన

అనంతరం మండలంలోని అనంతపేట్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. పారదర్శకంగా పనులు చేయాలని సూచించారు. నాణ్యమైన వస్తువులు వినియోగించాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతులు, విద్యుత్ పనులు పరిశీలించి అధికా రులకు సూచనలు చేశారు. జూన్ 5 లోపు పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామంలో జరుగుతున్న ఉ పాధిహామీ పనుల గురించి పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్‌అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామ జ నాభా, కూలీల సంఖ్య, చెల్లిస్తున్న వేతనాలు, కల్పి స్తున్న పని వివరాలపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎం శ్రీకళ, పంచాయతీరా జ్ ఈఈ శంకరయ్య, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు ఉన్నారు.



ధాన్యం తేమశాతం పరిశీలిస్తున్న కలెక్టర్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

భైంసాటౌన్/తానూరు: రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ హెచ్చరించారు. భైంసా పట్టణంలోని ఏడీఏ కార్యాలయంలో విత్తన వ్యాపారులతో గురువారం సమావేశం నిర్వహించారు. తర్వాత తానూర్ మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. డిమాండ్ ఉన్న రకాలను అధిక ధరలకు విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. పత్తి విత్తనాల కోసం మహారాష్ట్ర రైతులు కూడా వచ్చే అవకాశం ఉన్నందున, స్థానిక రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులు కూడా లైసెన్స్ కలిగిన వ్యాపారుల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసేటప్పుడు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. లూజ్ విత్తనాలు కొనుగోలు చేయవద్దని పేర్కొన్నారు. వ్యాపారి వద్ద రశీదు పొందేటప్పుడు లాట్ నంబర్ గమనించాలన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి కవర్‌ను పంట దిగుబడి వచ్చేవరకు భద్రపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ఏడీఏలు విద్యాసాగర్, వీణ, సోమ లింగారెడ్డి, పట్టణ సీఐ డి.రాజారెడ్డి, తానూరు ఏవో గణేశ్, ఎస్సై సందీప్, ఏఈవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో అంజిప్రసాద్

ఈదురుగాలులతో ట్రాన్స్‌కోకు భారీ నష్టం

కుంటాల: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో కల్లాలో ధాన్యం తడిసి రైతులు ఇబ్బంది పడ్డారు. ఈదురు గాలులకు ఓలాలో 18, వెంకూర్ 3 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. ఓలా, వెంకూర్ గ్రామాల్లో 3 ట్రాన్స్ ఫార్మర్లు గద్దెలపై నుంచి పడిపోయి దెబ్బతిన్నాయి. దీంతో ట్రాన్స్‌కోకు భారీ నష్టం వాటిల్లింది. బుధవారం సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ ఏఈ శివప్రసాద్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టి గురువారం సాయంత్రం వరకు సరఫరా పునరుద్ధరించారు. ఓలా గ్రామంలో వందకుపైగా వృక్షాలు విద్యుత్ తీగలపై పడ్డాయి. ఇక ఈదురుగాలల వర్షానికి పది ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో ఎం.ఏ.రహీం, ఆర్‌ఐ అడెల్లు, పంచాయతీ కార్యదర్శి యోగేశ్ ఇళ్లను పరిశీలించారు.



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ ఏఈ శివప్రసాద్

పునరావాస గ్రామాన్ని సందర్శించిన పీవో

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ సమీపంలోని రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామాన్ని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా గురువారం సందర్శించారు. నూతనంగా ఏర్పడిన పునరావాస కాలనీలో సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తానని తెలిపారు. పునరావాస గ్రామస్తులకు కుట్టు మిషన్ శిక్షణ, డ్రైవింగ్ శిక్షణ, కిరాణా దుకాణాలు ఏర్పాటు చేసే వారికి ఉపాధి కల్పిస్తామని వివరించారు. పీవో వెంట తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ ఉన్నారు.

‘ఉపాధి’కి వేతన కష్టాలు!

ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుని పేరు వడ్డోల్ల పోతన్న. ఝరి(బి) గ్రామానికి చెందిన ఇతను ఉపాధి కూలీగా పనిచేస్తున్నాడు. కూలీ డబ్బులు ఇటీవల అతని పోస్టాఫీస్ ఖాతాలో పడ్డాయి. దీంతో వాటికోసం తా నూరు మండలం బోల్సా పోస్టాఫీస్‌కు రెండు రోజులుగా వస్తున్నాడు. ఇక్కడ రోజుకు 50 నుంచి 60 మందికే డబ్బులు పంపిణీ చేస్తున్నారు. దీంతో నిరాశగా వెనుదిరుగుతున్నాడు. బుధవారం ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి బయల్దేరి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న బోల్సా పోస్టాఫీస్‌కు వచ్చా డు. అప్పటికే ఉమ్రి(కె), వడ్‌ఝరి(బి), బోల్సా, బోరి గాం, బెంబర గ్రామాలకు చెందిన సుమారు 200 మంది ఈ పోస్టాఫీస్‌కే వచ్చారు. పాస్‌బుక్‌లు వరుసలో పెట్టారు. పోతన్న పైన ఉన్న వారికి డబ్బులు పంపిణీ చేసే వరకు మధ్యాహ్నం అయింది. దీంతో పంపిణీ నిలిపివేశారు. ఇదేంటని అడిగితే మధ్యాహ్నం తర్వాత సర్వర్ పనిచేయదని చెప్పడంతో నిరాశగా వెనుదిరిగాడు. ఇది ఒక్క పోతన్న సమస్యే కాదు.. జిల్లాలో పోస్టాఫీస్ ఖాతాలో ఉపాధి డబ్బులు జమవుతున్న కూలీలంతా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు.





బోల్సా పోస్టాఫీసు ఎదుట నిరీక్షిస్తున్న ఉపాధి కూలీలు

- పోస్ట్ ఆఫీసుల్లో చెల్లింపులు
- సిగ్నల్ సమస్యతో గ్రామాలకు రాని అధికారులు
- మధ్యాహ్నం వరకే పంపిణీ చేస్తున్న వైనం..
- చాలా వరకు నిరాశగా వెనుదిరుగుతున్న కూలీలు

తానూరు: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంగా మారింది జిల్లాలో ఉపాధి కూలీల పరిస్థితి. పోస్టాఫీస్ ఖాతాలో ఉపాధి పనులకు సంబంధించిన డబ్బులు సమవుతుండగా, వాటిని తీసుకోవడం కూలీలకు ఓ ప్రహసనంగా మారింది. గ్రామాలకే వచ్చి డబ్బులు పంపిణీ చేయాల్సిన బీపీవోలు.. గ్రామాల్లో సిగ్నల్ సరిగా ఉండడం లేదని పోస్టాఫీసులకే పరిమితమవుతున్నారు. ఒక్కో పోస్టాఫీస్‌లో ఆరేడు గ్రామాలను చెందిన కూలీల ఖాతాలు ఉన్నాయి. దీంతో వారంతా పోస్టాఫీస్‌కు వెళ్లి కూలీ డబ్బులు తెచ్చుకోవాల్సి వస్తోంది.

మధ్యాహ్నం వరకే చెల్లింపులు..

జిల్లాలోని గ్రామీణ పోస్టాఫీస్‌లలో ఉపాధి కూలీలకు డబ్బులను మధ్యాహ్నం వరకే చెల్లిస్తున్నారు. దీంతో కూలీలు ఇబ్బంది పడుతన్నారు. నిబంధనల ప్రకారం గ్రామాలకే పంపిణీ చేయాల్సిన బీపీవోలు.. తమను పోస్టాఫీస్‌కు రప్పించుకుంటున్నారని, ఇక్కడ వరకు వచ్చినా.. మధ్యాహ్నం తర్వాత చెల్లించడం లేదని పేర్కొంటున్నారు. గ్రామాల్లోనే డబ్బులు పంపిణీ చేసేలా చూడాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఉపాధి కూలీల వివరాలు

జాబ్ కార్డులు	1,76,078
పనిచేస్తున్న ఉపాధి కూలీలు	2,33,155
బ్యాంకు ఖాతా ఉన్నవారు	1,68,922
పోస్ట్ ఆఫీస్ ఖాతాలు ఉన్నవారు	64,233

జిల్లా వ్యాప్తంగా 64,233 మందికి పోస్టాఫీస్ ఖాతాలు..

జిల్లాలో మొత్తం 1,76,078 జాబ్‌కార్డులు ఉండగా అందులో 2,33,155 మంది కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. వీరిలో 1,68,922 మంది కూలీలకు బ్యాంక్ ఖాతాలు ఉండగా, 64,233 మందికి పోస్ట్ ఆఫీస్‌లో ఖాతాలు ఉన్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో జిల్లాలో ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్, మే నెలకు సంబంధించిన కూలీ డబ్బులను కేంద్రం కూలీల ఖాతాల్లో సమ చేసింది. అయితే సకాలంతో డబ్బులు చేతికి అందకపోవడంతో పోస్టాఫీస్‌లో ఖాతాలు ఉన్న కూలీలు ఇబ్బంది పడుతున్నారు. పోస్టాఫీసుల్లో రోజుకు 50 నుంచి 60 మందికి మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారు. దీంతో మిగతావారు నిరాశగా వెనుదిరుగుతున్నారు.



డబ్బులు పంపిణీ చేస్తున్న పోస్ట్‌మ్యాన్

రెండు రోజులుగా..



కూలి డబ్బుల కోసం ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న బోల్సా గ్రామానికి రెండు రోజులుగా తిరుగుతున్నం. కూలీలు అధికంగా ఉండడంతో డబ్బులు దొరకడం లేదు. సర్వర్ రావడం లేదని రేపు రావాలని అధికారులు చెబుతున్నరు. అధికారులు మా గ్రామంలోనే డబ్బులు ఇచ్చేలా చూడాలి. – షేక్ సలీం, ఝరి(బి)

సమస్య పరిష్కరిస్తాం

పోస్ట్ ఆఫీస్‌లలో బీపీఎం పోస్టు ఖాళీ ఉన్న చోట ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతీ గ్రామంలో పోస్ట్ ఆఫిసులో ఖాతా ఉన్న కూలీలకు ఐపీపీ కార్డులు అందిస్తున్నాం. పోస్ట్ ఆఫీస్ పరిధిలోని గ్రామాల్లో బీపీఎంల ద్వారా డబ్బులు పంపిణీ చేసి కూలీలకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.
– కళ్యాణ్, నిర్మల్ జిల్లా పోస్టల్ బ్యాంక్ మేనేజర్

బీపీఎంను నిలదీసిన ‘ఉపాధి’ కూలీలు



బీపీఎం వరుణ్‌రాజ్‌రెడ్డిని నిలదీస్తున్న ఉపాధిహామీ కూలీలు

లోకేశ్వరం: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేసిన పనులకు సంబంధించిన వేతనాలు ప్రభుత్వం విడుదల చేసినా పంపిణీలో జాప్యం చేస్తున్నాడని పిప్రి బ్రాంచ్ పోస్టుమాస్టర్ (బీపీఎం) వరుణ్‌రాజ్‌రెడ్డిని ఉపాధి కూలీలు గురువారం నిలదీశారు. మండలంలోని నగర్ గ్రామ పంచాయతీకి చెందిన ఉపాధి కూలీలు డబ్బుల కోసం ఉదయం పిప్రి బ్రాంచి పోస్టాఫీస్‌కు వచ్చారు. బీపీఎం వరుణ్‌రాజ్‌రెడ్డి ఆసరా పింఛన్లు, ఉపాధి కూలీ డబ్బులు పంపిణీ చేపట్టాడు. ఈ సందర్భంగా పంపిణీలో జాప్యం జరుగుతుండడంతో కూలీలు ఒక్కసారిగా అతనితో గొడవకు దిగారు. కూలి డబ్బులు గ్రామానికి వచ్చి పంపిణీ చేయాల్సి ఉండగా, ఆరు నెలలుగా తమ ఊరికి ఎందుకు రావడం లేదని నిలదీశారు. తామందరికీ డబ్బులు చెల్లించే వరకూ ఇక్కడే ఉంటామని భీష్మించారు. విషయం తెలుసుకున్న లోకేశ్వరం ఎస్సై రాజు సంఘట స్థలానికి చేరుకుని కూలీలు, బీపీఎం వాదనలు విన్నారు. వెంటనే నర్సాపూర్ (జీ) ఎస్పీఎం మహేశ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నెలనెలా డబ్బులు చెల్లించేలా చూస్తామని ఎస్పీఎం హామీ ఇవ్వడంతో కూలీలు ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసు స్టేషన్ పరిధిలోని పోలీసు కాలనీలో గల హనుమాన్ ఆలయం, అదే కాలనీకి చెందిన టేకం రామారావు ఇంట్లో ఈనెల 21న జరిగిన చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్‌రూరల్ సీఐ ఫణిధర్ తెలిపారు. గురువారం మావల పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. హనుమాన్ ఆలయంలో హుండీలోని రూ.6వేల నగదు, రామారావు నివాసంలో 2 గ్రాముల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన డి.శ్యామ్, ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన అబ్దుల్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన మరో ఇద్దరు ఫారుఖ్, ఫేరోజ్ ఇందులో భాగస్వాములని తేలిందన్నారు. శ్యామ్, అబ్దుల్‌ను అరెస్టు చేశామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై విష్ణువర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

దస్తురాబాద్: ఆదిలాబాద్ ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ఎర్రగుంట, మున్యాల తండా, రేవోజీపేట గ్రామాల్లో దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు గంగారెడ్డి, ఎండీ అక్బర్ హుస్సేన్ తెలిపారు. దాడుల్లో 216 లీటర్ల నాటుసారా, 900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు. నిర్మల్ ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌రావ్, ఎస్సైలు వసంత్‌రావ్, గజేందర్, సింధు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ చోరీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎస్సార్ పెట్రోల్ బంక్‌లో బైక్ చోరీకి గురైంది. బజార్ హత్నూర్ మండల కేంద్రానికి చెందిన అంగ శ్రీనివాస్ ఈ నెల 17న తన ద్విచక్ర వాహనాన్ని ఎస్సార్ పెట్రోల్ బంక్ ముందు పార్క్ చేసి నిర్మల్‌కు వెళ్లాడు. గురువారం నిర్మల్ నుంచి ఇచ్చోడకు వచ్చి చూడగా బైక్ కనిపించక పోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: నిర్మల్ జిల్లాకు చెందిన యువతి (21) ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో అదృశ్యమైంది. గురువారం ఉదయం నిర్మల్ నుంచి జిల్లా కేంద్రంలో బీఎడ్ పరీక్ష రాయడానికి తన తండ్రితో కలిసి ఆదిలాబాద్‌కు వచ్చారు. బస్టాండ్‌లో కాలకృత్యాలు తీర్చుకుంటానని చెప్పి వెళ్లి తిరిగి రాకపోవడంతో యువతి తండ్రి టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు.

బొలెరోను ఢీ కొట్టిన ఆటో

నర్సాపూర్ (జి): మండలంలోని నసీరాబాద్ 61వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్సై తెలిపిన వివరాల మేరకు... నర్సాపూర్ (జి)మండల కేంద్రం నుంచి ఐదుగురు మహిళలు, ఒక బాలుడు రాంపూర్ గ్రామానికి ఆటోలో బయలుదేరారు. నసీరాబాద్ 61వ జాతీయ రహదారిపై ముందుగా వెళ్తున్న బొలెరోను ఢీకొన్న ఆటో బోల్తా పడింది. సాయవ్వ అనే మహిళకు తీవ్రంగా, మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

మండపంలో కొలువుదీరిన ఉత్సవ మూర్తులు



మాంగల్యధారణ చేస్తున్న పూజారులు



డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కమనీయం.. లక్ష్మీనరసింహుని కల్యాణం

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న యువతి



కల్యాణానికి హాజరైన భక్తులు

దిలావర్‌పూర్: మండలంలోని కల్వ గ్రా మ పరిసర అటవీప్రాంతంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీ నరసింహుడి కల్యాణాన్ని గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం నిత్యార్చన, అగ్ని ప్రతిష్ఠ, యజ్ఞాది కార్యక్రమం, మ ధ్యాహ్నం ధ్వజారోహణం, బలిహరణము, గరుడ ముద్దల కార్యక్ర మం నిర్వహించారు. ఈ నెల 31 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. కల్యాణాన్ని వీక్షించేందుకు వివిధ గ్రామాల నుంచి దాదాపు 25 వేలకు పైగా భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ వూజారం మహేశ్ భక్తులకు ఏర్పా ట్లు చేశారు. నిర్మల్ సీఐ శ్రీనివాస్, దిలావర్‌పూర్ ఎస్సై సుమాంజలి బందోబస్తు నిర్వహించారు.

పలువురి ప్రత్యేక పూజలు...

డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, కదిలి ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్‌రావు, నాయకులు పాల్దె అనిల్, రాజేందర్, మాజీ చైర్మన్ ఇప్ప నర్సారెడ్డి, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

అదుపుతప్పి ప్రైవేటు బస్సు బోల్తా



బోల్తాపడిన ముస్కాన్ ట్రావెల్స్ బస్సు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అలీమొద్దీన్

- ఒకరు మృతి
- ఐదుగురి పరిస్థితి విషమం
- 20 మందికి స్వల్ప గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షేక్ సలీమా

సారంగపూర్/ఇంద్రవెల్లి: మండలంలోని రాణాపూర్ సమీపంలోని మహబూబాఘాట్స్ సమీపంలో బుధవారం రాత్రి ప్రైవేట్ బస్సు బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండగా 24 మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ముస్కాన్ ట్రావెల్స్ బస్సు ఆదిలాబాద్ నుంచి బుధవారం రాత్రి 49 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. మహబూబాఘాట్స్ వద్దకు చేరుకోగానే బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో ఐదుగురికి తీవ్రగాయాలు కాగా 24 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ గ్రామానికి చెందిన షేక్ ఆఫ్రిన్ అలియాస్ షేక్ ఫర్హానా (29) అనే మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు, మిగతా ముగ్గురిని రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. బస్సు డ్రైవర్ ఇర్ఫాన్ అహ్మద్ పరారయ్యాడని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగినట్లు గుర్తించామని ఎస్సై తెలిపారు. మృతురాలి భర్త ఫయాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన కారు

సోన్: మండలంలోని మాదాపూర్ ఐబీ వద్ద గురువారం కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న కారు మాదాపూర్ ఐబీవద్ద 44వ జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సాయిని రవి, సిద్దిక్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ సతీష్ అజాగ్రత్తగా కారు నడపడంతోనే ప్రమాదం చోటు చేసుకుందన్నారు. బాధితుని సోదరుడు సాయిని ప్రవీన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సంతోషం రవీందర్ తెలిపారు.

బల్దియాకు అవినీతి మరక..!

- కమిషనర్ వ్యవహారంతో వెలుగులోకి..
- ఇతర శాఖల్లోనూ ఆమ్యామ్యాలు

భైంసాటౌన్: భైంసా మున్సిపాలిటీకి అవినీతి మరక అంటింది. కమిషనర్ వెంకటేశ్వర్లు, బిల్ కలెక్టర్ విద్యాసాగర్ రూ.30 వేలు లంచం తీసుకుంటూ బుధవారం ఏసీబీకి పట్టుబడిన విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది. బాధితుడు ధైర్యంగా ఏసీబీని ఆశ్రయించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కమిషనర్ కార్యాలయంలో తనకు అనుకూలంగా ఉండే ఇద్దరు ఉద్యోగులతో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుధ్య విభాగంలో పనిచేసే ఓ జవాన్ సహకారంతో పట్టణంలో నూతన భవన నిర్మాణాలు, వాటి అనుమతులు, పన్నుల్లో లొసుగులను ఆధారంగా చేసుకుని భవన యజమానులకు నోటీసులు జారీచేసి బెదిరింపులకు పాల్పడేవారని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆరోపించడం గమనార్హం. సదరు నోటీసులు సైతం కార్యాలయంలో సిబ్బందితో కాకుండా బయటి నుంచే తయారు చేయించడం, తనకు అనుకూలమైన ఉద్యోగులతో కలిసి డబ్బులు డిమాండ్ చేసేవారని తెలుస్తోంది. ఎంత మందిని ఇలా బెదిరించి డబ్బులు వసూల చేశారో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాలకవర్గం దృష్టికి రాకుండా గృహ, వాణిజ్య భవనాల పన్నులు, ట్రేడ్ లైసెన్స్, ఇతర వాటిల్లోనూ నిబంధనల మేరకు పన్ను మదింపు లేదన్న కారణంతో నోటీసులు జారీ చేయడం, అడిగినంత ఇచ్చుకుంటే చూసీచూడనట్లు వ్యవహరించేవారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇక బల్దియలో కొందరు ఉద్యోగులు విధులు రాకున్నా.. వేతనం పొందేలా సహకరించారని, తద్వారా వారి నుంచి లబ్ధి పొందారని వైస్‌చైర్మన్ ఆరోపించారు. కమిషనర్ వ్యవహారంతో భైంసా బల్దియాకు చెడ్డ పేరు వచ్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అన్ని శాఖల్లోనూ ఆమ్యామ్యాలు...

దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ అవినీతి రాజ్యమేలుతోంది. కొందరు అవినీతి అధికారులు, ఉద్యోగులు చేయి తడపనిదే ఏ పని చేయరన్న ఆరోపణలున్నాయి. ప్రతీ కార్యాలయంలో ప్రతీ పనికి ఓ రేటు ఉంటుందన్నది బహిరంగ రహస్యమే. అధికారి అడిగినంత ఇవ్వకుంటే తమ పని ఎక్కడ ఆగిపోతుందోనన్న భయంతో చాలామంది ఫిర్యాదు చేసేందుకు సాహసించడం లేదు. ఇదే అవినీతి అధికారులు, ఉద్యోగులకు కలిసివస్తోంది. బల్దియా కమిషనర్‌పై బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతోనే కమిషనర్ అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇతర ప్రభుత్వ శాఖల్లోనూ లంచావతారులున్నా ధైర్యంగా ఫిర్యాదు చేస్తే అసలు బాగోతాలు వెలుగులోకి వచ్చే అవకాశముంటుంది.

'నష్టపోయిన బాధితులను ఆదుకుంటాం'



పరిశీలిస్తున్న ఆత్రం సుగుణ

తలమడుగు: అకాల వర్షాలతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ భరోసానిచ్చారు. గురువారం మండలంలోని పునగుడ, ఝరి, మందగుడ, ఉమ్రీ గ్రామాల్లో పర్యటించారు. ఇళ్లు కూలిపోయి, పంటలు నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని భరోసానిచ్చారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లి కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు. ఆమె వెంట కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దివ్య మాధవ్, ఎంపీటీసీ రమేశ్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ ప్రకాష్ రావు, మాజీ సర్పంచ్‌లు గంగారం, రఘు, తిరుపతి, మాజీ ఎంపీపీ సిడాం రాము, తదితరులు ఉన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీ



ప్రైవేట్ ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో ధన్‌రాజ్

ఖానాపూర్: పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో అందిస్తున్న సేవల వివరాలు, సర్వీస్ చార్జీలు, ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ల అర్హత వివరాలు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ రిసెప్షన్ ప్రాంతంలో ప్రదర్శించాలని ఆదేశించారు. అన్నిరకాల రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. అనుమతులు లేకుండా ఆస్పత్రులు నిర్వహించే వారిపై, నిబంధనలు పాటించని ఆస్పత్రులపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని సింధుశ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఖాజ హాస్పటల్‌కు నోటీసులు జారీ చేశారు. డీఎంహెచ్‌వో వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారే రవీందర్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్ తదితరులు ఉన్నారు.

నిర్మల్ బృందానికి నృత్య పురస్కారం



పురస్కారాలతో వెన్నెల డ్యాన్స్ అకాడమీ నృత్య బృందం సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన ఇండియన్ డ్యాన్స్ ఫెస్టివల్ కార్యక్రమంలో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనకు గానూ నిర్మల్ జిల్లాకు చెందిన నాట్య బృందానికి పురస్కారం లభించింది. వెన్నెల డ్యాన్స్ అకాడమీకి చెందిన నృత్య బృందం డీవన్ టైటిల్ విన్నర్ ఫేమ్ హరినాథ్‌రెడ్డి చేతుల మీదుగా ఇండియన్ ఎక్సలెన్స్ పురస్కారం, ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డ్యాన్స్ మాస్టర్ ధనరాజ్, నాట్యప్రదర్శన బృందం సభ్యులు నిహారిక, సాయికృప, తార, అన్విక, శ్రీ మహిత, ఇందూ, నిహారిక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఫిల్టర్ బెడ్‌కు చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులు మహారాష్ట్రలోని సైలానిబాబా దర్గాను దర్శించుకునేందుకు బుధవారం రాత్రి కారులో బయల్దేరి వెళ్లారు. దర్శనం చేసుకున్న అనంతరం తిరుగు ప్రయాణంలో వాసిమ్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు పెద్దలతో పాటు మరో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి.

కారును ఢీకొన్న బైక్..



గాయాల పాలైన యువకుడు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బస్‌డిపో వద్ద గురువారం ఉదయం బైక్‌పై వేగంగా వచ్చిన ఓ యువకుడు యూటర్న్ తీసుకునే క్రమంలో కారును బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో యువకుడిని చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

భైంసారూరల్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు లోకేశ్వరం మండలంలోని బిలోలి గ్రామానికి చెందిన నల్లోల్ల లక్ష్మణ్ (30) మూడు నెలలుగా మాటేగాంలో ఉంటున్నాడు. ఇటీవలే బిలోలిలో ఉన్న తన ప్లాటుకు సంబంధించి వాగ్వాదం జరిగింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే ఇంట్లోనూ తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహానికి భైంసా ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య భోజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన సూర్యవంశీ అంబదాస్ (43) రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. వన్‌టౌన్ ఏఎస్సై దైవశాల తెలిపిన వివరాల ప్రకారం.. చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన అంబదాస్ కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈనెల 21న కూలీ పనికి వెళ్లి రాత్రి 8 గంటల ప్రాంతంలో శివాజీ చౌక్ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కారు ఢీకొని గేదెకు గాయాలు

నేరడిగొండ: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఓ కారు గేదెను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. కారులోని బెలూన్ ఓపెన్ కావడంతో ప్రాణాలతో బతికి బయటపడ్డారు. ఆ కారు వెనకాల మరో కారు ఆగడంతో వెనుకనుంచి ఐచర్ ఆ కారును ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న వారికి చిన్నపాటి గాయాలయ్యాయి. వెంటనే గ్రామస్తులు ఐచర్ వాహనంతో పాటు డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నిర్మల్‌రూరల్: మండలంలోని మంజులాపూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్సై సాయికుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడిచేసి నిందితుల వద్ద నుంచి రూ.17,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

దారికాచి దోచేస్తున్నారు

- పోలీసులకు పట్టించిన వాహన చోదకులు

సారంగపూర్: ప్రధాన రహదారులే లక్ష్యంగా చేసుకుని వాహనాలపై ప్రయాణించే వారిపై దాడిచేసి దోచుకుంటున్న ముఠా బుధవారం రాత్రి పట్టుబడింది. వాహనచోదకులే అప్రమత్తమై దారిదోపిడీకి ప్రయత్నించిన ఇద్దరిని చితకబాది పోలీసులకు అప్పగించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్‌కు చెందిన మొహమ్మద్ ఓవెస్, మొహమ్మద్ అంశార్ తమ ఆటోలో జనరేటర్ రిపేర్ చేయించడానికి పెర్కిట్ నుంచి ఇచ్చోడకు బయల్దేరి వెళ్లారు. ఈక్రమంలో మార్గమధ్యలో మహబూబాఘాట్స్ వద్ద రాత్రి మాటేగాంకు చెందిన అర్కల రంజిత్, పేంపల్లికి చెందిన జల్ల లక్ష్మణ్ మాటువేసుకుని ఉన్నారు. ఆటో అక్కడికి రాగానే బండరాళ్లతో దాడికి తెగబడ్డారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దర్ని బెదిరించి వారి వద్ద నుంచి రూ.200 లాక్కున్నారు. అదే సమయంలో మరో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిపై దాడికి ప్రయత్నించగా వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. అది గమనించిన మొహమ్మద్ అంశార్, మొహ్మద్ ఓవెస్ ద్విచక్ర వాహన చోదకులను ఆపి వివరాలు తెలిపారు. నలుగురు కలిసి దాడికి పాల్పడ్డ దొంగలను చితకబాది పోలీసులకు అప్పగించారు. నిందితులు అర్కల రంజిత్, జల్ల లక్ష్మణ్‌లను గురువారం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు. కోర్టు ఆదేశాలతో వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.